క్లుప్తంగా

మల్లేష్‌కు డాక్టరేట్

నల్లగొండ: మున్సిపాలిటీలోని చర్లపల్లికి చెందిన దాసరిబాబు మల్లేష్ అకాడమి ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవెటివ్ రిసెర్చ్, నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన ఎర్తు సైన్స్ విభాగంలో డాక్టరేట్ పొందారు. డాక్టర్ ఎ.కేశవకృష్ణ పర్యవేక్షణలో దాసరిబాబు మల్లేష్ ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో చమురు సహజ వాయువు తవ్వక స్థలాల్లో పర్యావరణ భౌగోళిక అధ్యయనాలు అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేసినందుకు ఈ నెల 2న డాక్టరేట్ అందుకున్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

కట్టంగూర్ : బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కట్టంగూర్ మండలంలోని కల్మెర గ్రామానికి చెందిన పాదూరి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆత్మరక్షణపై శిక్షణ

నకిరేకల్ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ కల్వకుంట్ల చంద్రసేనా గుప్తా 105వ జయంతి సందర్భంగా వాసవి వారోత్సవాల్లో భాగంగా నకిరేకల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరాటే మాస్టర్ అంజి, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాలికలు తమ ఆత్మరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో చూపించారు. క్లబ్ అధ్యక్షుడు గుండా నరేందర్, కార్యదర్శి వీరవెల్లి రఘునాథ్, ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చండూరు : చేనేత కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని చండూరులో ఎన్నుకున్నట్లు పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు. చండూరు చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడిగా రాపోలు వెంకటేశం, గౌరవ అధ్యక్షుడిగా తిరందాస్ శ్రీను, ఉపాధ్యక్షుడిగా జూలూరు వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా దుస్స గణేశ్, కోశాధికారిగా వర్కాల విజయ్ ఎన్నికయ్యారు.

పంటల పరిశీలన

మునుగోడు: మెట్ట పంటలు వేసిన భూముల్లో నీరు నిల్వ ఉండకుండా వెంటనే తొలగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ సూచించారు. బుధవారం మునుగోడు మండలంలోని గుండ్లోరిగూడెం, జమస్థాన్‌పల్లి గ్రామాల్లో పలువురు రైతుల పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఉపాధి కల్పించాలి

నల్లగొండ టౌన్: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పందిరి సైదులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తెలంగాణ కళావేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట నకిరెకంటి కిరణ్‌కుమార్, జువాజి ప్రవీణ్, యాదగిరి, నాగుల శ్రీను, కాటేపాక శంకర్, కోడి భీమ్ ప్రసాద్ ఉన్నారు.

ఉన్నత విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వం

నల్లగొండటౌన్: సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోందని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ ఆరోపించారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చెక్కులు అందజేత

మర్రిగూడ : మండలంలోని పిట్టల చిన్న తిమ్మయ్యకు మంజూరైన రూ.30వేలు, గ్యార యాదయ్యకు మంజూరైన రూ.30వేల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ బుధవారం అందజేశారు. మాజీ సర్పంచ్ మాస నీలిమా చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

తిప్పర్తి : హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని మండల ప్రత్యేక అధికారి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో నర్సరీలు, గత హరితహారంలో నాటిన మొక్కలను ఆమె పరిశీలించారు. అనంతరం మర్రిగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో సీనియర్ విభాగంలో నల్లగొండకు చెందిన సింగం ప్రవీణ్‌కుమార్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ ను బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో సత్యసాయి ధ్యాన మండలి నిత్య యోగా కేంద్రంలో రాపోలు వెంకటేశ్వర్లు గురూజీ ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చండూరు : తాస్కానిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వరకాల సత్తయ్య (64) ట్రాక్టర్ డీ కొట్టడంతో మంగళవారం మృతి చెందా డు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బుధవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

సూచిక బోర్డులు లేక అయోమయం

- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు
- జంక్షన్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని విన్నపం



కడపర్తి వద్ద తానంచర్ల హైవేపై సూచిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

నకిరేకల్ : హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి, నకిరేకల్–తానంచర్ల 365వ నంబర్ జాతీయ రహదారి నుంచి శాలిగౌరారం మండలానికి వెళ్లే దారిలో సూచిక బోర్డులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నకిరేకల్ పట్టణం నుంచి శాలిగౌరారం మండలానికి వెళ్లే మార్గం ఉంది. అయితే జాతీయ రహదారిపై ఇతర ప్రాంతాల నుంచి కొత్తగా వచ్చేవారు శాలిగౌరారం మండలానికి వెళ్లడానికి దారి తెలియక తికమక పడుతూ దారి తప్పుతున్నారు. నకిరేకల్‌లో పద్మనగర్ హైవే జంక్షన్, ఇనుపాముల జంక్షన్ దగ్గర శాలి గౌరారం మండలానికి దారి చూపే సూచిక బోర్డు ఏ ర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం మూలమలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కడపర్తి వద్ద..

నకిరేకల్ నుంచి ఐదు కిలోమీటర్లు ప్రయాణించిన తరువాత కడపర్తి గ్రామం వద్ద ఎడమ వైపునకు తిరిగి ఆర్అండ్‌బీ రహదారి మీదుగా శాలిగౌరారం మండలానికి వెళ్లాల్సి ఉంటుంది. కడపర్తి వద్ద శాలిగౌరారం వైపు దారి చూపే సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఈ రహదారి నుంచి శాలిగౌరారం మండల కేంద్రానికి కొత్తగా వెళ్లేవారు తికమక పడుతున్నారు. ఈహైవే నుంచి కడపర్తి దాటి అర్వపల్లి వైపునకు ముందుకు వెళ్తున్నారు. ఇక్కడ శాలిగౌరారం వైపు దారి చూపే సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



నకిరేకల్ హైవే జంక్షన్, కడపర్తి గ్రామానికి వెళ్లే దారిలో శాలిగౌరారం మండలానికి దారి చూపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ రెండు హైవేలపై శాలిగౌరారం వెళ్లే దారి తెలియక కొత్తగా వచ్చేవారు అయోమయానికి గురవుతున్నారు.

–నూనె నాగరాజు, కడపర్తి

బెల్టు దుకాణాలు ఎత్తివేస్తేనే నిధులు

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



కచలాపురం గ్రామస్తులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాలను పూర్తిస్థాయిలో ఎత్తివేయించాలని, అలా మూసివేయించిన గ్రామాలకు మాత్రమే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల ప్రజలతో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మునుగోడు మండలంలోని కచలాపురం, జక్కలవారిగూడెం, గంగోరిగూడెం గ్రామాల్లో నూటికి నూరుశాతం బెల్టు దుకాణాల ఎత్తివేతకు కృషిచేసిన ఆయా గ్రామ కమిటీల సభ్యులను శాలుశాలతో సన్మానించారు. ఆయా గ్రామాల అభివృద్ధికి వెంటనే రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తుండడంతో ఎంతోమంది పేద కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామాభివృద్ధికి పనిచేయాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తన వద్దకు వస్తే ఎలాంటి సహాయ, సహకారాలు అందించబోనని స్పష్టం చేశారు. కొందరు నాయకులు తమ స్వప్రయోజనాల కోసం పార్టీని, ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారని అన్నారు. అలాంటి నాయకుల చరిత్ర తన వద్ద ఉందని, వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. బెల్టు దుకాణాలు కొనసాగే గ్రామాల నాయకులు తన వద్దకు వచ్చి ఎలాంటి సహాయ, సహకారాలు కోరవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్ జక్కలి శ్రీను, గోపగోని పాపయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని నిర్మూలించాలి

మునుగోడులో మండలంలో గంజాయి, బెల్టు దుకాణాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చండూరు సీఐ వెంకటయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లును ఆదేశించారు. నేటికీ అనేక గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం, అదేవిధంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు కొనసాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలా వ్యాపారం కొనసాగించేవారు. ఎంతటివారైనా పట్టుకుని కేసులు నమోదు చేయాలని సూచించారు.

నిధులు మంజూరుచేయాలని వినతి

మునుగోడు మండలంలోని సింగారం గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా సింగారం అడ్డరోడ్డు నుంచి నేరటోనిగూడెం మీదుగా కచలాపురంకు బీటీ రోడ్డు వేయించాలని కోరగా.. అందుకు రూ. 2.4 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గేటుకు తాళం.. తెరుచుకోని పాఠశాల



పాఠశాల గేటు ఎదుట నిల్చున్న విద్యార్థులు

చిట్యాల: పాఠశాల ప్రారంభ సమయం దాటిపోయినా ఆ పాఠశాల గేటుకు వేసిన తాళం తీయకపోవడంతో పాఠశాల గేటు బయటనే విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు నిల్చున్న సంఘటన చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. పాఠశాల ప్రారంభ సమయాని కంటే ముందు గేటు తాళం తీయాల్సి ఉండగా తొమ్మిదిన్నర గంటలు దాటినా చిట్యాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాల గేటు తాళం తీయలేదు. దీంతో ఆ పాఠశాలకు ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి వచ్చిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం గేటు బయటనే ఉండాల్సి వచ్చింది. ఇదే పాఠశాల ఆవరణలో మండల విద్యాధికారి కార్యాలయం, భవిత విద్యా వనరుల కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో వీరంతా ఆ పాఠశాల గేటు ముందులోని సర్వీస్ రోడ్డుపైనే గంటపాటు నిరీక్షించాల్సి వచ్చింది. పాఠశాల హెచ్‌ఎం ఓ సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లడంతో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించాల్సిన ఉపాధ్యాయుడు తగిన విధంగా స్పందించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం తొమ్మిదిన్నర గంటల తరువాత గేటుకు వేసిన తాళం తొలగించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు లోనికి వెళ్లారు. కాగా పాఠశాలకు వాచ్‌మెన్ పోస్ట్ కొనేళ్లుగా ఖాళీగా ఉండడంతోపాటు అటెండర్ పోస్ట్ ఇటీవల ఖాళీ అయింది. దీంతో పాఠశాల నిర్వహణ ఇబ్బందిగా మారింది.

స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

నల్లగొండ టౌన్: వర్షాలకు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవడానికి స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా స్థానిక సంస్థల వద్ద డబ్బులు లేవన్నారు. గ్రామాలు, పట్టణాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు విష జ్వరాల బారిన పడి కీళ్ల నొప్పులతో అల్లాడిపోతున్నారని, అధికారులు అప్రమత్తమై విషజ్వరాలను అరికట్టాలని కోరారు. ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. కొన్ని నెలలుగా మురికి కాలువలు శుభ్రం చేయడం లేదని, చెత్త పేరుకుపోయి దోమలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

చిట్యాల: తమకు వేతనాలు పెంచాలని కోరుతూ చిట్యాల మున్సిపల్ కమిషనర్ వీరేందర్‌కు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనం ఇరవై ఆరు వేల రూపాయలకు పెంచి నెలనెలా అందించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓలు అమలుచేసి సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు దుస్తులు, చెప్పులు, నూనె, సబ్బులు, టవల్స్ వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఏనుగు వెంకట్‌రెడ్డి, జడల నర్సింహ, పాల లక్ష్మయ్య, బాకి అండాలు, సైదులు, శోభ, కవిత, ధనలక్ష్మీ, మల్లేష్, ముత్తయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



నార్కట్‌పల్లి: మాట్లాడుతున్న సీఐ నాగరాజు

నకిరేకల్ : గణేశ్ ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని నకిరేకల్ సీఐ రాజశేఖర్ సూచించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వినాయక ఉత్సవ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీస్ శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, కమిషనర్ బాలయ్య, ఎస్‌ఐలు గోపికృష్ణ, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చండూరు : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ వెంకటయ్య అన్నారు. చండూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం శాంతి సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేసేవారు అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతి

నార్కట్‌పల్లి: పోలీస్ శాఖ అమలుచేస్తున్న క్యూఆర్ కోడ్‌లో ఉన్న 32 నిబంధనలు పూర్తిచేసిన వారికే వినాయక విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వనున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. వినాయక చవితి పండుగ సందర్భంగా బుధవారం ఎస్ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ శాఖ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్ వస్తుందని, ఆ కోడ్‌ను విగ్రహం వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేరిపోతుల భారత్, కొరివి శంకర్, రేగట్టె నర్సింహారెడ్డి, బింగి కొండయ్య, యాసిన్‌ఖాన్, మట్టిపల్లి శ్రీను, పశుపతి, సమద్, రహీంఖాన్, వెంకన్న, సైదులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలు నిర్వహించేవారు నిబంధనలు పాటించాలని ఎస్ఐ కె.రంగారెడ్డి అన్నారు. బుధవారం పలు గ్రామాల గణేశ్ కమిటీల నిర్వాహకులతో పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది సైదులు, వాహీద్, రమేష్ తదితరులు ఉన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



నల్లగొండ రూరల్ : మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి

నల్లగొండ రూరల్: మహిళలు పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మీ అన్నారు. నల్లగొండ బుధవారం పట్టణంలోని 40వ వార్డులోని దయానంద్‌నగర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్‌ఎం నాతి శిరీషగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు యాదమ్మ, సరోజిని, వినోద పాల్గొన్నారు.

చిట్యాల: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మునుగోడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్య అన్నారు. ఉరుమడ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రోజా, మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ నర్సింహారావు, అంగన్‌వాడీ టీచర్లు అంజమ్మ, ధనమ్మ, లలిత పాల్గొన్నారు.

చండూరు : పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. గుండ్రపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏఎన్‌ఎం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె అంగన్‌వాడీ కేంద్రం–1, 2 లో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎంలు మహేష్, వెంకట్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివేష, అంగన్‌వాడీ టీచర్లు వనజ, సంతోష పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చండూరు : మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన శ్యామ్ తెలిపారు. తెలుగు–1, ఇంగ్లిష్–1, అర్థశాస్త్రం–1, కంప్యూటర్ సైన్స్–1 చొప్పున పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు పీహెచ్‌డీ, నెట్ సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు డాక్టర్ ఐ.శ్రీనివాస్ 9490536839 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అన్నెబోయిన లింగయ్య (70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధుముదిరాజ్ సమకూర్చిన రూ.పది వేలను బుధవారం ఆ గ్రామానికి చెందిన ఎన్ఎంఆర్(నీలం మధు ముదిరాజ్) యువజన సంఘం సభ్యుడు కుంభం శివముదిరాజ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మునుగోడు: మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన సూర వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని ఆ గ్రామ మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్ పరామర్శించి రూ.10వేలు అందజేశారు.

చికిత్స పొందుతూ మృతి

తిప్పర్తి : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన తిప్పర్తి మండలంలోని ఎల్లమ్మగూడంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆదిమల్ల లక్ష్మమ్మ (50)కు సంవత్సరం క్రితం మెడపై కనితి అయ్యింది. ఎన్ని మందులు వాడినా నొప్పి తగ్గకపోవడంతో నొప్పి భరించలేక ఈ నెల 2న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు మంగళవారం రాత్రి మృతి చెందింది. కుమారుడు ఆదిమల్ల సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ జమాల్ తెలిపారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

నల్లగొండ రూరల్: భారతీయ రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం ఎస్.గోమతి, ఎంజీయూ రిజిస్ట్రార్ రవి తెలిపారు. బుధవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో క్విజ్ పోటీల పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. రిజర్వు బ్యాంకు స్థాపించి 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిగ్రీ చదువుతున్న 25 ఏళ్ల లోపు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు విద్యార్థులు ఒక జట్టుగా పాల్గొనవచ్చని, ఒక కళాశాల నుంచి ఎన్ని జట్లయినా పాల్గొనవచ్చన్నారు. మొదటి విడత ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన అనంతరం రెండో దశ రాష్ట్ర స్థాయి, మూడో దశ జోనల్, నాలుగో దశ జాతీయ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. జాతీయ స్థాయి మొదటి బహుమతి రూ.10 లక్షల నగదు, రెండో బహుమతి రూ.8 లక్షలు, మూడో బహుమతి ఆరు లక్షల నగదు ఇస్తున్నట్లు తెలిపారు. పేర్ల నమోదుకు ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉందని, అన్ని కళాశాలల్లో నోటీసు బోర్డులో ఉంచామని తెలిపారు. అధ్యాపకులు అంజిరెడ్డి, ఎంవిఎస్.రెడ్డి, ప్రేమ్‌సాగర్, మధు, ఆర్‌బీఐ జిల్లా మేనేజర్ శ్రామిక్, ఎస్‌బీఐ అన్నెపర్తి మేనేజర్ రమ్య పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక








బద్రీనారాయణ | రామ్మోహన్‌రెడ్డి | కె మధు | కె.నాగలక్ష్మి | కోటిలింగయ్య | డి.అశోక్

కట్టంగూర్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఏడుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ మేక నాగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిటిపాముల హైస్కూల్‌కు చెందిన కక్కిరేణి బద్రీనారాయణ(జీహెచ్‌ఎం), చెర్వుఅన్నారం హైస్కూల్‌కు చెందిన బత్తుల కోటిలింగయ్య (ఎస్ఏ ఫిజికల్ సైన్స్), పాదూరు రామ్మోహన్‌రెడ్డి (ఎస్ఏ గణితం), పరడ హైస్కూల్‌కు చెందిన ఎండీ నజీరుద్దీన్(ఎస్ఏ ఇంగ్లిష్), ఎంపీపీఎస్ అక్కలాయిగూడెంకు చెందిన కొండ్ర నాగలక్ష్మి (ఎస్‌జీటీ), ఎంపీపీఎస్ మసిబాయిగూడెం కేతావత్ మధు(ఎస్‌జీటీ), ఎంపీపీఎస్ తూర్పు బాయిగూడెం దాసోజు అశోక్(ఎస్‌జీటీ)లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

రామగిరి (నల్లగొండ): శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ముత్యాలమ్మ జాతర మహోత్సవం బుధవారం రాత్రి రథోత్సవ ఊరేగింపుతో ముగిసింది. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మునాస వెంకన్న, రాజు, సత్యనారాయణ, ప్రసన్న, కొప్పు కృష్ణయ్య, పూజారి అంజయ్య పాల్గొన్నారు.

అక్రమ పైపుల తొలగింపు

తిప్పర్తి : మండల పరిధిలోని డి– 40 డిస్ట్రిబ్యూటరీపై ఉన్న అక్రమ పైపులైన్‌లను బుధవారం నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం తిప్పర్తి ఎస్ఐ సహకారంతో తొలగించినట్లు ఇరిగేషన్ ఏఈ శివ తెలిపారు. నీటిపారుదల శాఖ అనుమతి లేకుండా ఎలాంటి పైపులైన్‌లు వేయరాదని సూచించారు. అక్రమంగా పైపులు వేయడం వల్ల చివరి భూములకు నీరు అందడం లేదన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

నల్లగొండటౌన్: ఎన్నికల సందర్భంగా ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానన్న హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహాలక్ష్మిలో భాగంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ అమలు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో పోలబోయిన వరలక్ష్మీ, పాలడుగు ప్రభావతి, కొండ అనురాధ, జిట్ట సరోజ, దైద జానకమ్మ, తుమ్మల పద్మ, చానబోయిన నాగమణి, బూతం అరుణకుమారి, పాదూరి గోవర్ధన్, కారంపాడి ధనలక్ష్మీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ఎక్కడ పనిచేసినా విద్యార్థుల ఎన్‌రోల్ పెంచడమే లక్ష్యం



ఆకారంలో ఓ ఇంటివద్ద ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపించాలని కోరుతున్న అంజయ్య

శాలిగౌరారం: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకుసాగి ఆదర్శంగా నిలుస్తున్నాడు.. ఆకారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు యెడవల్లి అంజయ్య. కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన యెడవల్లి అంజయ్య 2002లో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా ఉద్యోగం సాధించాడు. 17 అక్టోబర్ 2002లో ఆదిలాబాద్ జిల్లా రెబ్బెన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యోగంలో చేరాడు. ఆ రోజు విద్యార్థుల సంఖ్య 85 మంది. తనకున్న ఇద్దరు పిల్లలను కూడా తాను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. విద్యార్థుల సంఖ్యను 192కు తీసుకువచ్చాడు. నవంబర్ 2009లో కట్టంగూరు మండలం మసిబాయిగూడెం ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చాడు. విధుల్లో చేరేనాటికి ఆ పాఠశాల 12 మందిసంఖ్యను 26 మందికి పెంచారు. జూలై 2018లో ఆకారం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరేనాటికి విద్యార్థుల సంఖ్య 65 మంది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యను 106 మందికి పెంచారు.

ఆటపాటలతోనే విద్యా బోధన



విద్యార్థికి వినాయకుడి వేషం వేసి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

మర్రిగూడ : ఆట, పాట లేనిదే ఆయన పాఠం ముందుకు సాగదు..నల్లబల్లపై పాఠ్యాంశ చిత్రాలను గీసి ఆసక్తికరమైన బోధన చేయడం ఆయన సొంతం. ఆయనే రాంరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లెంకలపల్లి వెంకటేశ్వర్లు. 2008లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఎంపికై సీసీఎస్ మర్రిగూడ, ఎంపీపీఎస్ నడికుడ, గుర్రంపోడు మండలంలో పనిచేసి 2013లో శివన్నగూడకు బదిలీ అయ్యారు. పాఠశాల అనంతరం, ఆదివారం, సెలవుల్లో విద్యార్థులకు గురుకుల, నవోదయ, ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో శిక్షణ ఇచ్చారు. ఆయన కృషిని గుర్తించిన ప్రభుత్వం 2015లో మండల స్థాయి, 2019, 2021లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేసింది. 2020–21 లో కరోనా సమయంలో దూరదర్శన్, యాదగిరి చానల్ ద్వారా, టీ శాట్ చానళ్ల ద్వారా పరిసరాల విజ్ఞానం పాఠ్యాంశాలను ఆసక్తికరంగా బోధించి మన్ననలు పొందారు. జూలై 1, 2024న రాంరెడ్డిపల్లికి బదిలీ అయ్యారు.

విద్యార్థుల సంఖ్య పెంచారు



పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

తిప్పర్తి : మండలంలోని సిలార్‌మియాగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయుడు మధుబాబు ఐదేళ్ల క్రితం ఈ పాఠశాలకు వచ్చినప్పుడు 20 మంది విద్యార్థులు ఉండేవారు.. ప్రస్తుతం 40మంది ఉన్నారు. వీరు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించేవారు. దాతల సహకారంతో పాఠశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయ్యింది.